క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

సైదాబాద్: చెట్ల కొమ్మల తొలగింపు, ఇతర మరమ్మతు పనుల కారణంగా శనివారం ఆస్మాన్‌ఘడ్ ట్రాన్స్‌కో డివిజన్ పరిధిలోని పలుచోట్ల విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని డీఈ హన్మంత్‌రెడ్డి తెలిపారు.

- ఉదయం 6 నుండి 8 గంటల వరకు : లక్ష్మీనగర్ పార్క్, టెలిఫోన్ ఎక్స్ఛేంజ్ లీడ్ ఇండియా స్కూల్, జయానగర్ పార్క్ పరిసరాలు
- ఉదయం 8 గంటల నుండి 10 గంటల వరకు: సైదాబాద్ 2ఆర్టీ, మెయిన్‌రోడ్, వెంగళ్‌రావ్ పీటీ, సైదాబాద్ రామాలయం ,ఎస్‌బీహెచ్ ఆఫీసర్స్ కాలనీ, లక్ష్మీనగర్ సాయిబాబా టెంపుల్ పరిసర ప్రాంతాల్లో కరెంట్ సరఫరా ఉండదని డీఈ తెలిపారు.

కూరగాయల ధరలు

దిల్‌సుఖ్‌నగర్: సరూర్‌నగర్/వనస్థలిపురం రైతుబజార్‌లలో కూరగాయల ధరలు (కిలో...రూపాయల్లో...) టమోటా 17. వంకాయ 28, బెండ 35, పచ్చిమిర్చి 45, కాకర 52, బీర 40, క్యాలిఫ్లవర్ 23, క్యాబేజీ 16, కారెట్ 32. దొండ 23, ఆలు 20, ఉల్లి 14, గోకర 45, దోస 15, సొర 9, పొట్ల 15, అరటి 10, చిక్కుడు 55, అర్వి 35, మునగ 45, చిలగడదుంప 55, బీట్‌రూట్ 21, కీర 18, ఫ్రెంచ్ బీన్స్ 105, కాప్సికమ్ 40.
ఈధరలు శనివారం 9 గంటల వరకు ఈధరలు అమలులో ఉంటాయి.

జర్నలిస్టులకు అండగా ఉంటా

లింగోజిగూడ: ఎల్‌బీనగర్ నియోజకవర్గంలో పని చేస్తున్న వర్కింగ్ జర్నలిస్టులకు వెంటనే ఇంటి స్థలాలను అందజేయాలని కాంగ్రెస్ పార్టీ జీహెచ్‌ఎంసీ ఫ్లోర్ లీడర్, లింగోజిగూడ డివిజన్ కార్పొరేటర్ దర్పల్లి రాజశేఖర్‌రెడ్డి డిమాండ్ చేశారు.శుక్రవారం డివిజన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జర్నలిస్టులందరికీ ఇళ్ల స్థలాలు ఇచ్చే వరకు వారికి అండగా ఉంటానని తెలిపారు. ఈ విషయంపై మల్కాజిగిరి ఎంపీ, టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డితో మాట్లాడి జర్నలిస్టులకు స్థలాలు వచ్చేలా తన వంతు కృషి చేస్తానని అన్నారు.

మార్గం రాజేష్‌కు పురస్కారం



రాజేష్‌కు ఉత్తమ సేవా రత్న పురస్కారం అందజేస్తున్న దృశ్యం

దిల్‌సుఖ్‌నగర్: ఏపీలోని కావలి పట్టణంలో వివిధ రాష్ట్రాలలో అనాథ, నిరుపేదలకు సేవలందిస్తున్న ప్రముఖులకు అవార్డులను అందచేశారు. ఆర్‌కేపురం డివిజన్ చిత్రలేవుట్ కాలనీలో అనాథ విద్యార్థి గృహ అధ్యక్షులు మార్గం రాజేష్‌కు కావలి పట్టణ రెడ్ క్రాస్ చైర్మన్ డాకారపు రవిప్రకాష్ ఉత్తమ సేవా రత్న పురస్కారం అందజేశారు.

అమావాస్య అన్న ప్రసాద వితరణ



అన్నాదానం చేస్తున్న ఎమ్మెల్సీ బొగ్గారపు దయానంద్, చిలుక ఉపేందర్‌రెడ్డి

దిల్‌సుఖ్‌నగర్: అమావాస్య సందర్భంగా రంగారెడ్డి జిల్లా ఆర్యవైశ్య, మహాసభ ఆధ్వర్యంలో ఆర్‌కేపురం అల్కాపురి శ్రీ కృష్ణ మందిరం వద్ద సుమారు 400 మందికి శుక్రవారం అన్న ప్రసాద కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షులు అమరావది లక్ష్మీనారాయణ, ఎమ్మెల్సీ బొగ్గారపు దయానంద్, జిల్లా అధ్యక్షులు వెంకటేశం, రాష్ట్ర యువజన కాంగ్రెస్ నాయకులు చిలుక ఉపేందర్ రెడ్డిలు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలి

నాగోలు: డివిజన్ పరిధిలోని బండ్లగూడ గ్రామంలోని శ్మశాన స్థలాన్ని కొందరు కబ్జా చేసి నిర్మాణాలు చేస్తున్నారని వారిపై చర్యలు తీసుకోవాలని శుక్రవారం బండ్లగూడ గ్రామస్తులు జీహెచ్‌ఎంసీ హయత్‌నగర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ మారుతి దివాకర్‌ను కలసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ శ్మశాన వాటికకు గతంలో ప్రభుత్వం స్థలం కేటాయించిందని గత 18 సంవత్సరాల క్రితం మున్సిపాలిటీ అధికారులు ప్రహరీ గోడను నిర్మించారని తెలిపారు. కొద్ది రోజులుగా ప్రహరీని కూల్చి కొందరు అక్రమంగా గుడిసెలు వేస్తూ నిర్మాణాలు చేస్తున్నారని తెలిపారు.

పగలే వెలుగుతున్న వీధి దీపాలు

వనస్థలిపురం: వనస్థలిపురం డివిజన్ పరిధిలో హస్తినాపురం ఈస్ట్, శ్రీనివాసపురం, వెంకటరమణ కాలనీ, హస్తినాపురం డివిజన్ పరిధిలో ద్వారకామయినగర్ తదితర కాలనీల్లో తరచుగా వీధి దీపాలు పగలు వెలగడం పరిపాటిగా మారింది. రాత్రి వేళల్లో వెలగాల్సిన వీధి దీపాలు పగలు వెలగడం ఏమిటని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

అదనపు గదులు పూర్తయ్యేదెన్నడో..!

ఏళ్ళ తరబడి కొనసాగుతున్న పాఠశాల అదనపు గదుల నిర్మాణం



అసంపూర్తిగా ఉన్న అదనపుగదుల నిర్మాణం



అదనపు గదుల నిర్మాణం కోసం 2019లో వేసిన శిలాఫలకం

హయత్‌నగర్: ప్రభుత్వ పాఠశాలలపై ప్రభుత్వ నిర్లక్ష్యానికి అద్దం పడుతోంది హయత్‌నగర్ జిల్లా పరిషత్ పాఠశాల. ఐదేళ్ళగా అదనపు గదుల నిర్మాణం పూర్తి కాకపోవడంతో ఉపాధ్యాయులు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. విద్యార్థుల సంఖ్యకు సరైన గదులు లేక పాఠశాలలో అడ్మిషన్లు నిలిపి వేస్తున్నా అధికారులు స్పందించడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

- హయత్‌నగర్‌లోని జిల్లా పరిషత్ పాఠశాలకు తరగతి గదులు సరిపోక అదనపు గదులు నిర్మించాలని విద్యా సంక్షేమ మౌళిక వసతులఅభివృద్ధి కార్పొరేషన్ ద్వారా రూ.70 లక్షల అంచనాలతో నిర్మించేందుకు 2019 డిసెంబర్‌లో పునాది వేశారు.

అప్పుడే పనులు మొదలు పెట్టలేదు. రెండేళ్ళ క్రితం పనులు మొదలైనా ఒక అడుగు ముందుకు రెండు అడుగుల వెనక్కు అన్నట్లుగా నిర్మాణం పనులు నత్తనడకన సాగుతున్నాయి. ఏళ్లు గడుస్తున్నా అదనపు గదుల నిర్మాణం పూర్తి కాక పోవడంతో ఈ ఏడాది పాఠశాలలు తెరిచే వరకైనా అందుబాటులోకి వస్తాయా లేదా అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

బిల్లుల చెల్లింపులో జాప్యమే కారణం

బిల్లులు చెల్లింపులో జాప్యం కారణంగా గదుల నిర్మాణం నెమ్మదిగా జరుగుతోందని కాంట్రాక్టర్ తెలిపారు. ఈ ఏడాది విద్యాసంవత్సరం మొదలయ్యే వరకు గదుల నిర్మాణం పూర్తి చేస్తామని ఆయన తెలిపారు.

మలక్‌పేటలో పెలికాన్ సిగ్నళ్లు ప్రారంభం



సిగ్నళ్లు ప్రారంభిస్తున్న ట్రాఫిక్ డీసీపీ అశోక్‌కుమార్

మలక్‌పేట: సేఫ్ సిటీ ప్రాజెక్ట్‌లో భాగంగా పాదచారుల భద్రత కోసం రద్దీ ప్రాంతాలలో పెలికాన్ సిగ్నళ్లు అందుబాటులోకి తీసుకొచ్చినట్లు ట్రాఫిక్ డీసీపీ అశోక్‌కుమార్ తెలిపారు. మలక్‌పేట ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని యశోద ఆసుపత్రి వద్ద, మలక్‌పేట రైల్వేస్టేషన్ టీ.జంక్షన్‌లో కొత్తగా ఏర్పాటు చేసిన పెలికాన్ సిగ్నళ్ల పాదచారులతో కలిసి ఆయన శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ డీసీపీ మాట్లాడుతూ పెలికాన్ సిగ్నళ్ల వద్ద వలంటీర్లు 15 నుంచి 20 సెకన్లు ట్రాఫిక్ ఆపి.. పాదచారులను భద్రంగా రోడ్డును దాటిస్తారని చెప్పారు. పాదచారులు ఎక్కడపడితే అక్కడ రోడ్డు దాటకుండా నియంత్రిచడం ద్వారా వాహనదారులకు కూడా ఉపయుక్తంగా ఉంటుందన్నారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం 3 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు ఇద్దరు వలంటీర్లు సిగ్నళ్లను నిర్వహిస్తారని తెలిపారు. కార్యక్రమంలో ట్రాఫిక్ అడిషనల్ డీసీపీ ప్రసాద్, ట్రాఫిక్ ఏసీపీలు సత్యనారాయణ పాల్గొన్నారు.

ఎంపీ నిధుల నుంచి సీసీ కెమెరాలుకు నిధులు మంజూరు



నిధుల మంజూరు పత్రాన్ని అంద చేస్తున్న మల్‌రెడ్డి రాంరెడ్డి

చంపాపేట: చంపాపేట డివిజన్ బైరామల్‌గూడ ప్రాంతంలోని ప్రగతినగర్ కాలనీవాసుల విజ్ఞప్తి మేరకు ఎంపీ రేవంత్‌రెడ్డి నిధుల నుంచి రూ. 4 లక్షలు మంజూరైనట్లు ఎల్‌బీనగర్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి మల్‌రెడ్డి రాంరెడ్డి తెలిపారు. శుక్రవారం చంపాపేటలోని పార్టీ కార్యాలయంలో డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు దాచర్లపల్లి శ్రీపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆయన హాజరై ప్రగతినగర్ కాలనీ సంక్షేమ సంఘ ప్రతినిధులకు నిధుల మంజూరు పత్రాన్ని అందచేశారు. కార్యక్రమంలో నాయకులు నారాయణ, శ్రవణ్, పరమేష్, వెంకటేష్, యాదయ్య, రణధీర్‌రెడ్డి, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన సేవలందించేందుకే వార్డు కార్యాలయాలు



కాలనీలోని పాత భవనాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

హస్తినాపురం: ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు నగరంలోని అన్ని డివిజన్లలో ప్రత్యేకంగా వార్డు కార్యాలయాలను ఏర్పాటు చేసి ఎక్కడి సమస్యలను అక్కడే పరిష్కరిస్తామని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి తెలిపారు. హస్తినాపురం డివిజన్ ఇంద్రప్రస్థ కాలనీ ఫేజ్-2 కాలనీవాసులు శుక్రవారం ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిసి సమావేశమయ్యారు. కమ్యూనిటీహాల్‌లో వార్డు కార్యాలయం ఏర్పాటు చేయడం వల్ల ఇతర కార్యక్రమాలు చేసుకునేందుకు వీలుండదని ఎమ్మెల్యే దృష్టికి తీసుకురావడంతో ప్రత్యేకంగా వార్డు కార్యాలయం ఏర్పాటు చేస్తానని తెలిపారు. అదే విధంగా డివిజన్ల పరిధిలో ఉపయోగంలో లేని పాత భవనాలను గుర్తిస్తే, అధికారుల సూచనల మేరకు ఇట్టి భవనాలను పరిశీలించి అనుకూలంగా ఉంటే కేటాయిస్తామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. కార్యక్రమంలో కాలనీ ప్రతినిధులు, నాయకులు అధికారులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలి

కార్పొరేటర్ కొత్తకాపు అరుణరవీందర్‌రెడ్డి



సీసీరోడ్డు నిర్మాణ పనులు పర్యవేక్షించిన కార్పొరేటర్ కొత్తకాపు అరుణరవీందర్‌రెడ్డి

సైదాబాద్: డివిజన్‌లో కొనసాగుతున్న అభివృద్ధి పనుల్లో కాంట్రాక్టర్లు నాణ్యతా ప్రమాణాలు కచ్చితంగా పాటించేలా అధికారులు తరచూ పర్యవేక్షిస్తుండాలని సైదాబాద్ కార్పొరేటర్ కొత్తకాపు అరుణ రవీందర్‌రెడ్డి సూచించారు. శుక్రవారం కార్పొరేటర్ జీహెచ్‌ఎంసీ, వాటర్‌వర్క్స్ అధికారులతో కలిసి డివిజన్ పరిధిలోని జయానగర్ కాలనీ, పూసలబస్తీలో పర్యటించారు. జయానగర్ కాలనీలో నిర్మిస్తున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను ఆమె పర్యవేక్షించారు. పూసలబస్తీలో కలుషిత నీటి సరఫరాతో ఇబ్బందులకు గురవుతున్నామని స్థానికులు కార్పొరేటర్ దృష్టికి తెచ్చారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ ఏఈ వెంకన్న, వర్క్ ఇన్‌స్పెక్టర్ రాజ్‌కుమార్, వాటర్‌వర్క్స్ వర్కింగ్ ఇన్‌స్పెక్టర్ మనోహర్, దివ్యజ్యోతి ఫౌండేషన్ నిర్వాహకుడు అనంత్‌రెడ్డి పాల్గొన్నారు.

కుమ్మరి వృత్తిదారులను ప్రభుత్వం ఆదుకోవాలి



మాట్లాడుతున్న నడికుడి జయంత్‌రావు

చంపాపేట: అర్హులైన కుమ్మరి కుల వృత్తిదారులకు నెలకు రూ.5వేల ఫించన్ మంజూరు చేసి ఆదుకోవాలని రాష్ట్ర కుమ్మరి సంఘ అధ్యక్షుడు నడికుడి జయంత్‌రావు ప్రభుత్వాన్ని కోరారు. శుక్రవారం చంపాపేట డివిజన్ కర్మన్‌ఘాట్‌లోని అనంద్ ఫంక్షన్‌హాల్‌లో సంఘ ప్రధాన కార్యదర్శి మల్కాజిగిరి దయానంద్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రాష్ట్ర కార్యవర్గ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. రాష్ట్రంలోని కుల వృత్తి కుటుంబీకులకు లక్ష రూపాయలు ఆర్థిక సహాయం చేస్తున్నట్లు సీఎం కేసీఆర్ ప్రకటించటం హర్షణీయమని అన్నారు. కార్యక్రమంలో సంఘ రాష్ట్ర కమిటీ సభ్యులు జిల్లెల శంకర్, ఎగిరిశెట్టి వీరయ్య పాల్గొన్నారు.


సమాజం కోసం పోరాడిన మహోన్నత వ్యక్తి సుందరయ్య



నివాళులర్పిస్తున్న ఎల్లయ్య తదితరులు

హస్తినాపురం: పేదలు లేని సమాజం కోసం కలలుగన్న అవిశ్రాంత పోరాటయోధుడు పుచ్చలపల్లి సుందరయ్య అని.. ఆయన ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ పాటుపడాలని ఎల్‌బీనగర్ సర్కిల్ సీపీఎం కార్యదర్శి ఆలేటి ఎల్లయ్య అన్నారు. శుక్రవారం హస్తినాపురం డివిజన్ పరిధిలోని నందనవనం కాలనీలో సీపీఎం కార్యదర్శి పాండునాయక్ అధ్యక్షతన జరిగిన పుచ్చలపల్లి సుందరయ్య 38వ వర్ధంతిని పురస్కరించుకుని ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఎల్లయ్య హాజరై సుందరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. నిరుపేద ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు అనేక ప్రజాపోరాటాలు చేసిన మహోన్నత వ్యక్తి పుచ్చలపల్లి సుందరయ్య అని ఆయనను అందరూ ఆదర్శంగా తీసుకోవాలని అన్నారు. సీఐటీయూ నాయకులు లక్ష్మయ్య, శ్రీను, జంగయ్య, శాంతమ్మ, బాలు, లలిత, సాలమ్మ, రాజేశ్వరీ, సైదులు, పరెంగన్, రాజునాయక్ తదితరులు పాల్గొన్నారు.

దేవాలయాల్లో చోరీలకు పాల్పడుతున్న ఇద్దరి అరెస్ట్



మాట్లాడుతున్న ఎల్‌బీనగర్ డీసీపీ సాయిశ్రీ

నాగోలు: దేవాలయాల్లో చోరీలకు పాల్పడుతున్న ఇద్దరిని సరూర్‌నగర్ పోలీసులు అరెస్టు చేసి రూ. 6,550 నగదు స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించారు. శుక్రవారం ఎల్‌బీనగర్ డీసీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎల్‌బీనగర్ డీసీపీ సాయిశ్రీ తెలిపిన మేరకు.. సంతోష్‌నగర్, భారత్ ఫంక్షన్ హాల్ ప్రాంతంలో ఉండే తలారి మనోజ్‌కుమార్(19) అలియాస్ మనోజ్, నాగర్ కర్నూల్ జిల్లా వెల్దండ బైరాపూర్‌కు చెందిన బండారి శాంసన్ (20) క్యాటరింగ్ పనులు చేసి జీవనం సాగిస్తున్నారు.

- సరూర్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని దుర్గామాత దేవాలయంలో ఈ నెల 15న రాత్రి సమయంలో గుడికి తాళం వేసి వాచ్‌మెన్ వెళ్లిపోయాడు. 16న ఉదయం వచ్చి చూడగా గుర్తు తెలియని వ్యక్తులు దుర్గామాత గుడిలోకి వెళ్లగా హనుమాన్ గుడి ముందు ఉన్న హుండీ తెరిచి అందులో ఉన్న నగదును చోరీచేసినట్లు గమమనించాడు. దీంతో దేవాలయ కమిటీ సభ్యులు సరూర్‌నగర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు ఆలయంలోని సీసీటీవీలను పరిశీలించి ఇద్దరిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి 6,550 నగదు స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించారు. ఇద్దరు నేరస్తులు గతంలో దొంగతనం కేసులో అరెస్టు అయి జైలుకి వెళ్లివచ్చారు. సమావేశంలో ఎల్‌బీనగర్ ఏసీపీ శ్రీధర్‌రెడ్డి, సరూర్‌నగర్ సీఐ జానకి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హాస్టళ్ల సమస్యలు పరిష్కరించండి



మలక్‌పేట: సంక్షేమ హాస్టళ్ల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ తెలంగాణ సోషలిస్టు స్టూడెంట్ అసోసియేషన్ (టీఎస్ఎస్ఏ) నేతలు శుక్రవారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సచివాలయంలో ఎస్సీ సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్‌ను కలిశారు. కాచిగూడ బాయ్స్ హాస్టల్ కాంప్లెక్స్, ముషీరాబాద్ గర్ల్స్ హాస్టల్ కాంప్లెక్స్ పునర్నిర్మాణానికి బడ్జెట్ విడుదల చేయించి, కొత్త కాంప్లెక్స్‌లు నిర్మించేలా చర్యలు తీసుకోవాలని కోరినట్లు అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కూర్వెళ్ల మహేష్‌కుమార్, గ్రేటర్ అధ్యక్షుడు నక్క వెంకటేష్, రాష్ట్ర నాయకుడు మేడి నాగరాజు తెలిపారు.

22న బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సమావేశం

సైదాబాద్: ఐఎస్‌సదన్ డివిజన్ చంపాపేటలోని సామ సరస్వతి కన్వెన్షన్‌హాల్‌లో ఈనెల 22న బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సమావేశం నిర్వహిస్తున్నట్లు బీజేపీ భాగ్యనగర్ జిల్లా అధ్యక్షుడు సంరెడ్డి సురేందర్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం సైదాబాద్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు బండి సంజయ్ అధ్యక్షతన నిర్వహించే సమావేశంలో పార్టీ జాతీయ సహ సంఘటనా కార్యదర్శి శివప్రకాష్, పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ తరుణ్‌చుగ్, బీజేపీ జాతీయ కార్యదర్శి సునిల్ బన్సల్, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి పాల్గొంటారన్నారు.

గీతారెడ్డికి ఉత్తమ సేవారత్న పురస్కారం



పురస్కారం అందుకుంటున్న గీతారెడ్డి

మన్సూరాబాద్: ప్రపంచ మానవ హక్కుల సంఘం మహిళా విభాగం జాతీయ చైర్ పర్సన్ గీతారెడ్డి ఉత్తమ సేవారత్నం పురస్కారం అందుకున్నారు. మన్సూరాబాద్ సూర్యోదయ కాలనీలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ నెల్లూరు జిల్లా కావలి పట్టణంలో గురువారం జరిగిన కార్యక్రమంలో స్థానిక ఆర్‌డీఓ వికే శీనునాయక్, డాక్టర్ రోహిత్, డాక్టర్ ప్రభాకర్‌నాయుడు చేతుల మీదుగా పురస్కారం అందుకున్నట్లు తెలిపారు.

మృతురాలి కుటుంబసభ్యులకు ఆర్థికసాయం



దుర్గమ్మ కుటుంబ సభ్యులకు చెక్కు అందజేస్తున్న మేయర్ విజయలక్ష్మి

ఎల్‌బీనగర్: ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ మృతి చెందిన పారిశుధ్య కార్మికురాలి కుటుంబ సభ్యులకు మేయర్ గద్వాల విజయలక్ష్మి శుక్రవారం ఆర్థిక సహాయం అందజేశారు. హయత్‌నగర్ సర్కిల్ పరిధిలో పారిశుద్ధ్య కార్మికురాలిగా పని చేస్తున్న దుర్గమ్మ జనవరి 10న విధుల్లో భాగంగా ఆటోనగర్‌లో పని చేస్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడిన దుర్గమ్మను చికిత్స నిమిత్తం ఈఎస్ఐ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతున్న దుర్గమ్మ జనవరి 14వతేదిన మృతి చెందింది.దీంతో దుర్గమ్మ భర్త పురుషోత్తం, కుమారుడు సుధీర్‌లకు రూ.2లక్షల చెక్కును అందజేశారు.

లోక్‌అదాలత్‌తో సత్వర న్యాయం



మాట్లాడుతున్న జిల్లా మెట్రోపాలిటన్ సెషన్స్ న్యాయమూర్తి డా. కె. పట్టాభిరామారావు

రంగారెడ్డి జిల్లాకోర్టులు: రెండవ జాతీయ లోక్ అదాలత్‌ను పురస్కరించుకుని జూన్ 10న జరగబోయే లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా మెట్రోపాలిటన్ సెషన్స్ న్యాయమూర్తి డా.కె.పట్టాభిరామారావు కోరారు. శుక్రవారం జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. గత సంవత్సరం నిర్వహించిన నాలుగు జాతీయ లోక్‌అదాలత్‌లలో రంగారెడ్డి జిల్లాకు సంబంధించి నాలుగు లక్షల అరవై నాలుగు వేల పైచిలుకు కేసులు రాజీ ద్వారా పరిష్కారమయ్యాయన్నారు. కక్షిదారులకు రూ.పదికోట్లకు పైగా పరిహారం చెల్లించామన్నారు. ఈ సంవత్సరం ఫిబ్రవరిలో నిర్వహించిన మొదటి జాతీయ లోక్ అదాలత్‌లో 82 వేల పైచిలుకు కేసులు పరిష్కరించి కక్షిదారులకు సుమారు రూ. ఆరు కోట్ల నష్టపరిహారం చెల్లించి రాష్ట్రంలో మొదటి స్థానంలో నిలిచామని ఆయన తెలిపారు. అదే స్ఫూర్తితో జూన్ నెల 10న జాతీయ లోక్‌అదాలత్ నిర్వహిస్తామన్నారు.

ప్రతిభ చూపిన 'న్యూమాస్టర్ మైండ్' విద్యార్థులు



విద్యార్థులను అభినందిస్తున్న డిప్యూటీ మేయర్ ఇబ్రాం

బడంగ్‌పేట్: కార్పొరేషన్ పరిధిలోని న్యూమాస్టర్ మైండ్ జూనియర్ కాలేజీ విద్యార్థులు ఈ ఏడాది ఇంటర్ పరీక్షల్లో సత్తా చాటారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను యాజమాన్యం అభినందించింది. ముఖ్య అతిథిగా బడంగ్‌పేట కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ ఇబ్రాం శేఖర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా డిప్యూటీ మేయర్ ఇబ్రాం శేఖర్ మాట్లాడుతూ.. చదువుంటే ఈ ప్రపంచాన్ని జయించవచ్చని సూచించారు. లక్ష్యంతో చదివితే విజయాలు సొంతం అవుతాయని అందుకు ఉదాహరణే ఈ మాస్టర్‌మైండ్ ర్యాంకులు అన్నారు. కార్యక్రమంలో మాస్టర్‌మైండ్ బడంగ్‌పేట కాలేజీ ప్రిన్సిపాల్ డా.జగన్మోహన్‌రావు, సెక్రెటరీ పాండు రామావత్, డైరెక్టర్లు, ప్రిన్సిపాల్, సిబ్బంది పాల్గొన్నారు.

క్రైస్తవ ఆత్మీయ సమ్మేళనాన్ని విజయవంతం చేయండి



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎల్‌బీనగర్ క్రిస్టియన్ అసోసియేషన్ నేతలు

మన్సూరాబాద్: ఈ నెల 21న సరూర్‌నగర్ స్టేడియంలో జరిగే క్రైస్తవ ఆత్మీయ సమ్మేళనాన్ని జయప్రదం చేయాలని ఎల్‌బీనగర్ క్రిస్టియన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎం.దేవానంద్ పిలుపునిచ్చారు. మన్సూరాబాద్ బెతస్థాకాలనీలోని చర్చ్‌లో ఆత్మీయ సమ్మేళనం వాల్‌పోస్టర్‌ను శుక్రవారం అసోసియేషన్ సభ్యులతో కలిసి అధ్యక్షుడు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా దేవానంద్ మాట్లాడుతూ ఈ కార్యక్రమానికి రాష్ట్ర మంత్రి కొప్పుల ఈశ్వర్, ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే, ఎంఆర్‌డీసీఎల్ చైర్మన్ దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి, ఫుడ్ కార్పొరేషన్ చైర్మన్ రాజీవ్‌సాగర్ హాజరవుతారన్నారు.

షాదీముబారక్, కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ



లబ్ధిదారుకు షాదీ ముబారక్ చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బలాల

మలక్‌పేట: ప్రభుత్వ సంక్షేమ పథకాలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే అహ్మద్ బలాల అన్నారు. శుక్రవారం పంజేషాహలోని కార్యాలయంలో సైదాబాద్, అంబర్‌పేట మండలాలకు చెందిన 60 మందికి షాదీముబారక్, కళ్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేశారు. ఓల్డ్ మలక్‌పేట, వాహేద్‌నగర్, శంకర్‌నగర్, ఆనంద్‌నగర్, కాలాడేరా కాలనీ, శంకేశ్వర్‌బజార్, సైదాబాద్ కాలనీ, ఎల్ఐసీ కాలనీలకు చెందిన లబ్ధిదారులకు అందజేసిన చెక్కుల విలువ రూ.60,06,960 ఉంటుందన్నారు. కార్యక్రమంలో సైదాబాద్ మండల ఆర్ఐ హరిబాబు, అంబర్‌పేట ఆర్ఐ శ్రీకాంత్, మజ్లిస్ నాయకులు ఉన్నారు.

దృష్టి మరల్చి చోరీ.. నిందితుడి అరెస్ట్

- 30 తులాలు బంగారం స్వాధీనం

నాగోలు: షాపుల ముందు పార్క్ చేసిన వాహనాల వద్ద డ్రైవర్లు ఉన్నపుడు డబ్బు వెదజల్లి వారి దృష్టి మరల్చి వాహనాల్లో ఉన్న బంగారం, వెండి, నగదును మాయం చేసే వ్యక్తిని చైతన్యపురి పోలీసులు అరెస్టు చేసి 30.1 తులాల బంగారం అభరణలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. శుక్రవారం ఎల్‌బీనగర్ డీసీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎల్‌బీనగర్ డీసీపీ సాయిశ్రీ తెలిపిన మేరకు.. తమిళనాడుకు చెందిన వెంకటేషన్(36) కూలీ పనిచేసుకొని జీవనం సాగిస్తుంటాడు. ఇతనితో పాటు అదే ప్రాంతానికి చెందిన జగన్, కిరణ్, కలిసి ఓ ముఠాగా ఏర్పడ్డారు. అందరూ తాపీ పని చేస్తూ కుటుంబంతో కలసి జీవిస్తున్నారు. వెంకటేషన్‌కు రామ్‌జీగ్యాంగ్, గ్యాంగ్ సభ్యులతో పరిచయం ఉంది. ఈ క్రమంలో నగరానికి వచ్చాడు. మార్చి 4 వ తేదిన చైతన్యపురి పోలీస్ స్టేషన్ పరిధిలోని కొత్తపేట గ్రీన్ హిల్స్ కాలనీలో ఉన్న ఫస్ట్ క్రై షాపింగ్‌కు పీర్జాదిగూడకు చెందిన డాక్టర్ స్పందన తన భర్త ప్రమోద్‌తో తమ బొలెరో వాహనంలో డ్రైవర్ శ్రీనివాస్‌తో కలసి వచ్చింది. కారును రోడ్డు వద్ద పార్కింగ్ చేసి ఇద్దరు షాపింగ్‌కు వెళ్లారు. డ్రైవర్ శ్రీనివాస్ వద్ద వెంకటేషన్ వచ్చి అతనిని మాటతో మభ్యపెట్టి డ్రైవర్ కూర్చునే డోర్ వద్ద నగదు విసిరి అతని దృష్టిని మరల్చాడు. డ్రైవర్ వాహనం కిందికి దిగేటట్లు చేసి వాహనంలో ఉన్న బంగారం, నగదు ఉన్న రెండు హ్యాండ్ బ్యాగ్స్‌తో ఉడాయించాడు. హ్యాండ్ బ్యాగ్స్ చోరీకి గురైనట్లు.. అందులో 49.5 తులాల బంగారం అభరణాలు, 20 వేల నగదు ఉన్నట్లు బాధితులు చైతన్యపురి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు చైతన్యపురి ఎస్ఐ ముదాసీర్ అలీ నేతృత్వంలోని క్రైమ్ బృందం తమిళనాడుకు వెళ్లి అతడిని అరెస్టు చేసి అతని వద్ద నుండి 30.1 తులాలు బంగారు అభణాలు స్వాధీనం చేసుకున్నారు. ఈ ముఠాలోని సభ్యులైన జగన్, కిరణ్, యతావన్, మోహన్‌రాజులు పరారీలో ఉన్నారని తెలిపారు. వారిని త్వరలోనే అరెస్టు చేస్తామని తెలిపారు. సమావేశంలో ఎల్‌బీనగర్ ఏసీపీ శ్రీధర్‌రెడ్డి, చైతన్యపురి సీఐ మధుసూధన్, ఎస్ఐ ముదాసిర్ అలీ, సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు వీరన్నగుట్టలో ఎమ్మెల్యే బస్తీ నిద్ర

మన్సూరాబాద్: ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి శనివారం మన్సూరాబాద్ డివిజన్ హయత్‌నగర్ పరిధి వీరన్నగుట్ట బస్తీలో బస్తీ నిద్ర కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు జక్కిడి మల్లారెడ్డి తెలిపారు. డివిజన్ పరిధిలోని పలు కాలనీలలో పర్యటించి సమస్యలు తెలుసుకుని చిన్న చిన్న సమస్యలను సంబంధిత అధికారులతో చర్చించి అప్పటికప్పుడు పరిష్కారిస్తారని పేర్కొన్నారు.